
# భారత్ జనాభా 146 కోట్లు!

**గణనీయంగా తగ్గిన సంతానోత్పత్తి రేటు | ఐక్యరాజ్యసమితి నివేదికలో వెల్లడి**

భారతదేశ జనాభా 2025లో 146 కోట్లకు చేరుకుంది. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ నిలిచిందని యూఎన్ డెమోగ్రఫిక్ రిపోర్టు వెల్లడించింది. అయితే భారత్‌లో సంతానోత్పత్తి రేటు క్రమంగా తగ్గుతున్నదని తెలిపింది. యూనైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్ (యూఎన్ఎఫ్‌పీఏ) స్టేట్ ఆఫ్ పాపులేషన్ రిపోర్ట్ (ఎస్‌వోడబ్ల్యూపీ)-2025 నివేదిక జనాభా విషయంలో భారత్ ఎదుర్కొంటున్న సవాళ్లను వివరించింది.




దేశంలో సంతానోత్పత్తి రేటు 1.9కి పడిపోయింది. 1961లో భారత్ మహిళలు సగటున ఆరుగురికి జన్మనిచ్చేవారు. ప్రస్తుతం ఒకరిద్దరితో సరిపెడుతున్నారు. దీంతో దేశంలో మరణాల రేటు కంటే జననాల రేటు తక్కువగా ఉంది.

## జాతీయ భద్రతా సలహా బోర్డు సభ్యుడిగా సతీశ్ రెడ్డి



హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): జాతీయ భద్రతా సలహా బోర్డు (ఎన్ఎస్ఏబీ) సభ్యుడిగా డీఆర్డీవో మాజీ ఛైర్మన్ సతీశ్ రెడ్డి నియమితులయ్యారు. ఈ నియామకం మంగళవారం నుంచి రెండేండ్లు పాటు కొనసాగనుంది. 'రా' మాజీ చీఫ్ అలోక్ జోషి నేతృత్వంలో జాతీయ భద్రతా సలహా బోర్డును కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రధాని నేతృత్వంలో ఉన్న జాతీయ భద్రతా కౌన్సిల్‌కి ఈ బోర్డు సూచనలు చేస్తుంది. బోర్డులో సభ్యులుగా మాజీ వెస్ట్రన్ ఎయిర్ కమాండర్ ఎయిర్ మార్షల్ పీఎం సిన్హా, ఆర్మీ సదరన్ మాజీ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ ఏకే సింగ్, రియర్ అడ్మిరల్ మోంటీ ఖన్నా, విశ్రాంత ఐపీఎస్ అధికారులు రాజీవ్ రంజన్ వర్మ, మన్మోహన్ సింగ్, మాజీ విదేశాంగ శాఖ అధికారి బీ వెంకటేశ్ వర్మను నియమించారు. తాజాగా రక్షణ రంగ నిపుణుడు, డీఆర్డీవో మాజీ చైర్మన్ సతీశ్ రెడ్డికి కేంద్రం చోటు కల్పించింది.

## మహా కుంభమేళా మృతులు 37 కాదు 82!

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో ఈ ఏడాది ఆరంభంలో మహా కుంభమేళా సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 37 మంది మరణించినట్టు ఆ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. కానీ, మృతుల సంఖ్యను యూపీ ప్రభుత్వం తక్కువగా చూపినట్టు బీబీసీ వార్తా సంస్థ తేల్చింది. ఆ తొక్కిసలాటలో 82 మంది ప్రాణాలు కోల్పోయినట్టు తన దర్యాప్తు నివేదికలో వెల్లడించింది. ఈ దర్యాప్తులో భాగంగా ఆ సంస్థ దేశవ్యాప్తంగా 11 రాష్ట్రాల్లోని 50 జిల్లాల్లో బాధితుల కుటుంబాలను విచారించింది. తద్వారా మృతుల సంఖ్య అధికారికంగా కంటే చాలా ఎక్కువగా ఉన్నట్టు నిర్ధారించింది.

# ఉగ్రవాది కంటే హీనంగా!

- అమెరికాలో భారత విద్యార్థిపై పోలీసుల కర్కశత్వం
- కింద పడేసి, చేతులు వెనక్కి విరిచి బేడీలు వేసిన పోలీసులు
- అక్రమంగా దేశంలోకి వస్తే ఉపేక్షించబోమన్న అమెరికా
- అగ్రరాజ్యంలో భారత పౌరులకు పదేపదే అవమానాలు
- ఆత్మగౌరవం కాపాడటంలో ప్రధాని విఫలం: జైరాం రమేశ్



భారత విద్యార్థిని నేలపై పడేసి బేడీలు వేస్తున్న అమెరికా పోలీసులు (ఫైల్)

న్యూఢిల్లీ, జూన్ 10: అమెరికాలో భారతీయులకు పదేపదే అవమానాలు ఎదురవుతున్నా.. కేంద్రంలోని బీజేపీ సర్కారులో మాత్రం చలనం రావటం లేదు. ట్రంప్ రెండో పర్యాయం అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే అక్రమ వలసదారులను దేశం నుంచి పంపించివేసే సమయంలో భారత పౌరులకు సంకెళ్లు వేయడంపై దుమారం రేగిన విషయం తెలిసిందే. తాజాగా ఓ భారత విద్యార్థిపై అమెరికా పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు దారితీస్తున్నది. వీసా రద్దయిందని, చట్ట వ్యతిరేకంగా అమెరికాలోకి ప్రవేశించావని చెప్తూ ఎయిర్‌పోర్టులో భారత విద్యార్థిని నేలపై పడేసి, చేతులు వెనక్కి విరిచి బేడీలు వేయడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతున్నది.

**భారత కాన్సులేట్ ఏం చేస్తున్నది?**

ఉగ్రవాదులను కూడా ఇంత హీనంగా అమెరికాలో అరెస్టు చేయటం చూడలేదని ఘటనలో ప్రత్యక్ష సాక్షి, ప్రవాస భారతీయుడు కునాల్ జైన్ వాపోయారు. అమెరికాలో అప్పుడే అడుగుపెట్టిన ఒక భారతీయ విద్యార్థి పట్ల అమెరికా వ్యవహరించిన తీరు తనను తీవ్రంగా కలిచివేసిందని ఇందుకు సంబంధించిన వీడియో, ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'ఉగ్రవాదులను కూడా అమెరికాలో ఈ విధంగా అరెస్టు చేయటం చూడలేదు. నేను నిస్సహాయుడిగా ఉండిపోయాను. నా మనసు ముక్కలైంది. ఇది మానవ విషాదం ' అంటూ కునాల్ జైన్ వివరించారు. 'అమెరికాకు ఎందుకు వచ్చాడన్నది అతడు సరిగా వివరించలేదు. దాంతో పోలీసులు అతడి పట్ల దారుణంగా వ్యవహరించారు. అతనితో హిందీలో మాట్లాడేందుకు ఎవర్నీ అనుమతించలేదు. న్యాయ సహాయం కూడా నిరాకరించటం బాధాకరం' అని కునాల్ జైన్ చెప్పారు. ఇలాంటి ఘటనలు ప్రతి రోజూ 3 లేదా 4 జరుగుతున్నప్పుడు సదరు వ్యక్తులకు సాయం చేయడానికి భారత కాన్సులేట్ ఎందుకు ముందుకు రావటం లేదని ఆయన ప్రశ్నించారు.

**వీసాల దుర్వినియోగాన్ని ఉపేక్షించం: అమెరికా ఎంబసీ**

నెవార్క్ ఎయిర్‌పోర్ట్‌లో భారతీయ విద్యార్థికి ఎదురైన ఘటనపై భారత్‌లోని అమెరికా ఎంబసీ స్పందించింది. చట్టబద్ధంగా వచ్చే ప్రయాణికులకు మాత్రమే తమ దేశంలోకి ప్రవేశం ఉంటుందని, వాళ్లకు మాత్రమే వెల్‌కం చెబుతామని పేర్కొంది. దేశంలోకి అక్రమ ప్రవేశాలను ఉపేక్షించేది లేదని స్పష్టం చేసింది. అక్రమ ప్రవేశం, వీసాల దుర్వినియోగం, అమెరికా చట్టాన్ని ఉల్లంఘించడాన్ని సహించబోమని అమెరికా తెలిపింది. న్యూయార్క్‌లోని భారత రాయబార కార్యాలయం కూడా స్పందించింది. సోషల్ మీడియాలో వచ్చిన పోస్ట్‌పై సంబంధిత వర్గాలతో మాట్లాడుతున్నట్టు తెలిపింది. భారత పౌరుల సంక్షేమానికి కాన్సులేట్ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నది.

**మోదీ మౌనమేల?: కాంగ్రెస్**

అమెరికాలో భారతీయులకు జరుగుతున్న అవమానాలపై విపక్ష కాంగ్రెస్ మండిపడింది. తాజా ఘటనపై ప్రధాని మోదీ వెంటనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో మాట్లాడాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అమెరికాలో భారతీయులకు పదే పదే అవమానాలు జరుగుతున్నా ప్రధాని మోదీ మౌన ముద్ర వహిస్తున్నారని, భారతీయుల ఆత్మగౌరవం కాపాడటంలో ప్రధాని మోదీ విఫలమయ్యారని కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్ విమర్శించారు. మంగళవారం ఆయన 'ఎక్స్'లో స్పందిస్తూ, 'భారత్-పాక్ కాల్పుల విరమణ ప్రకటన అమెరికా అధ్యక్షుడు ప్రకటించటం దేశ చరిత్రలోనే మొదటిసారి. భారత్‌పై ఒత్తిడి తీసుకొచ్చి కాల్పుల విరమణ ప్రకటించేలా చేశానని అమెరికా అధ్యక్షుడు స్వయంగా ప్రకటించారు. దీనిపై ప్రధాని మోదీ మాట్లాడటం లేదు. అలాగే అమెరికాలో భారతీయులపై దురాగతాలు జరుగుతున్నా.. ట్రంప్‌తో మాట్లాడే ధైర్యం చేయటం లేదు' అని విమర్శించారు.

## నేడు రోదసిలోకి శుభాన్షు శుక్లా



న్యూఢిల్లీ: భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా సహా మరో ముగ్గురు వ్యోమగాముల రోదసి యాత్రకు సర్వం సిద్ధమైంది. వ్యోమగాముల్ని ఐఎస్ఎస్‌కు తీసుకెళ్తున్న ఫాల్కన్-9 రాకెట్ ప్రయోగాన్ని బుధవారం సాయంత్రం చేపడుతున్నారు. ఈ మిషన్ ద్వారా రాకేశ్ శర్మ (1984లో) తర్వాత అంతరిక్షంలోకి వెళ్తున్న రెండవ భారతీయుడిగా శుక్లా చరిత్ర సృష్టించబోతున్నారు. 41 ఏండ్ల తర్వాత రోదసిలో అడుగుపెడుతున్న భారతీయుడిగా ఆయన పేరు రికార్డులకు ఎక్కనున్నది. లక్నోకు చెందిన శుభాన్షు శుక్లా, 2006లో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో చేరారు. ఎయిర్‌ఫోర్స్‌లో గ్రూప్ కెప్టెన్ హోదాలో ఉన్నారు. గగన్‌యాన్ మిషన్ కోసం ఏర్పాటు చేసిన 'భారత వ్యోమగామి దళం'కు 2019లో ఎంపికయ్యారు.




## మాల్దీవుల గ్లోబల్ టూరిజం అంబాసిడర్‌గా కత్రినా కైఫ్

న్యూఢిల్లీ: మాల్దీవుల పర్యాటకానికి గ్లోబల్ అంబాసిడర్‌గా ప్రముఖ బాలీవుడ్ నటి కత్రినా కైఫ్ నియమితులయ్యారు. ఆ దేశ మార్కెటింగ్, ప్రజా సంబంధాల శాఖ మంగళవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఐకాన్‌గా, విలక్షణ నటిగా, అనేక అవార్డులు అందుకున్న ఆంత్రప్రెన్యూర్‌గా కత్రినా కైఫ్‌ను మాల్దీవులు పేర్కొన్నది. మాల్దీవుల ప్రకటనపై కత్రినా కైఫ్ హర్షం వ్యక్తం చేశారు. గొప్ప గౌరవంగా భావిస్తున్నట్టు చెప్పారు.

# లాస్ ఏంజిలిస్ టు షికాగో

- 'యాంటీ ఐస్' నిరసనలు తీవ్రం
- మరిన్ని నగరాలలో ఆందోళనలు



శాన్‌ఫ్రాన్సిస్కోలో నిరసన ర్యాలీ

లాస్ ఏంజిలిస్: అక్రమ వలసదారుల అరెస్టుకు నిరసనగా గత వారాంతంలో లాస్ ఏంజిలిస్‌లో చెలరేగిన నిరసనలు సోమవారం అమెరికాలోని ఇతర నగరాలకు పాకాయి. అట్లాంటాలో యూఎస్ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఐసీఈ-ఐస్) కార్యాలయం ముందు పలువురు ఆందోళనకు దిగారు. అరెస్టయిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆస్టిన్, న్యూయార్క్, షికాగో, సియాటెల్, డాలస్, కెంటకీ తదితర నగరాల్లో నిరసనకారులు ఐస్ దాడులకు వ్యతిరేకంగా ఆందోళన నిర్వహించారు. మరోవైపు లాస్ ఏంజిలిస్‌లో జరుగుతున్న నిరసనలను అణచేసేందుకు అదనంగా మరో 2 వేల మంది నేషనల్ గార్డ్‌లను పంపాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారులను ఆదేశించారు. అమెరికా సైన్యం తాత్కాలికంగా 700 మెరైన్లను నగరానికి పంపింది. అక్రమ వలసదారుల కోసం నగరంలో సోదాలు ముమ్మరంగా జరుగుతుండటంతో నిరసనకారులు వీధుల్లోకి వచ్చారు. దీంతో స్థానిక నివాసితులు తమ భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. అయితే బలగాల మోహరింపు చర్యను ట్రంప్ సమర్థించుకుంటూ.. తాను నేషనల్ గార్డులను పంపకపోతే లాస్ ఏంజిలిస్ నగరం పూర్తిగా తుడిచి పెట్టుకుపోయేదన్నారు. మిలిటరీ మోహరింపుపై కాలిఫోర్నియా అటార్నీ జనరల్ రాబ్ బొంటా మరోసారి మండిపడ్డారు. 'ఇది ప్రజల భద్రత కోసం కాదు. ఇది ఒక ప్రమాదకరమైన అధ్యక్షుడి అహాన్ని దెబ్బ తీయడం గురించి. ట్రంప్ చర్య నిర్లక్ష్యంగా, అర్థ రహితంగా, మన సైన్యాన్ని అగౌరవ పరిచేలా ఉంది' అని ఆయన వ్యాఖ్యానించారు.

**నిరసనలెందుకంటే?**

ఈ నెల 6న ఐస్ ఏజెంట్లు లాస్ ఏంజిలిస్‌లో అక్రమ వలసదారుల ఏరివేత కోసం దాడులు నిర్వహించడంతో వారికి మద్దతుగా వలసదారుల నిరసనలు ప్రారంభమయ్యాయి. తర్వాతి రోజు పలు హోమ్ డిపార్ట్‌మెంట్ స్టోర్లలో ఐస్ సోదాలు జరిపింది. లాటిన్ దేశాల వలసదారుల కోసం ఐస్ ఏజెంట్లు సోదాలు చేశారని నిరసనకారులు ఆరోపించారు. సాయంత్రానికల్లా వందలాది మంది నిరసనకారులు ఫెడరల్ భవనం బయట గుమికూడి ర్యాలీ నిర్వహించారు. కాలిఫోర్నియా సర్వీస్ ఎంప్లాయిస్ ఇంటర్నేషనల్ యూనియన్ అధ్యక్షుడితో సహా వంద మందినిపైగా పోలీసులు అరెస్ట్ చేయడంతో జూన్ 7 నుంచి నిరసనలు తీవ్ర రూపం దాల్చాయి. లాస్‌ఏంజిలిస్‌లోని డౌన్‌టౌన్ నిరసనలకు కేంద్ర బిందువుగా మారింది.

## సంక్షిప్త వార్తలు

### కర్ణాటకలో మళ్లీ కులగణన

బెంగళూరు: కర్ణాటకలో కుల గణనను తిరిగి నిర్వహించాలని కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయించింది. పదేండ్ల కిందట నిర్వహించిన కులగణనపై పలు కుల సంఘాల నుంచి వ్యతిరేకత వ్యక్తమైన నేపథ్యంలో ఏఐసీసీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. దీనిని 60-80 రోజుల్లో పూర్తి చేయాలని సీఎం సిద్ధరామయ్యకు సూచించినట్టు తెలిపారు.

### ముడా స్కామ్.. రూ. 100 కోట్ల ఆస్తుల సీజ్

న్యూఢిల్లీ: కర్ణాటకలో కాంగ్రెస్ సీఎం సిద్ధరామయ్య నిందితుడిగా ఉన్న ముడా స్కామ్ కేసులో ఈడీ దూకుడు పెంచింది. సుమారు రూ.100 కోట్ల విలువైన 92 ఆస్తులను తాత్కాలికంగా అటాచ్ చేసింది. సిద్ధరామయ్య, ఇతరులపై నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈ కేసు దర్యాప్తు సాగుతున్నది. ఈ కుంభకోణంలో ఈడీ ఇప్పటివరకు రూ.400 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకుంది.

### కెన్యాలో ప్రమాదం.. ఐదుగురు ఇండియన్స్ మృతి

నైరోబీ: కెన్యాలో 28 మంది భారతీయుల బృందం ప్రయాణిస్తున్న బస్సు లోయలోకి పడిపోవడంతో ఐదుగురు మృతి చెందారు. సోమవారం ఈ ప్రమాదం జరిగిందని ఖతార్‌లోని భారత ఎంబసీ ఎక్స్‌లో తెలిపింది. మృతులంతా ఖతార్‌లో నివసిస్తున్న భారతీయులని తెలిపింది. గల్ఫ్ టైమ్స్ దిన పత్రిక కథనం ప్రకారం న్యాన్‌డరువా ఈశాన్య కౌంటీలో ప్రయాణిస్తున్న పర్యాటకుల బస్సు అదుపు తప్పి లోయలోకి పడిపోయింది. మృతులు కేరళకు చెందినవారు.

### ఆస్ట్రియా స్కూల్‌లో కాల్పులు.. 9 మంది మృతి

వియాన్నా: ఆస్ట్రియాలోని రెండో పెద్ద నగరమైన గ్రాజ్‌లో మంగళవారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. బోర్గ్ డ్రెయిర్‌షుట్జెన్‌గాస్సే పాఠశాలలో ఓ విద్యార్థి జరిపిన కాల్పుల్లో కనీసం 9 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం నిందితుడైన విద్యార్థి పాఠశాల టాయిలెట్‌లో తనను తాను కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టు నగర మేయర్ ఇల్కే కార్ వెల్లడించారు.

### చాట్‌జీపీటీ సేవల్లో అంతరాయం..భారత్‌పై ఎఫెక్ట్

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఓపెన్‌ఏఐ చాట్‌బాట్ చాట్‌జీపీటీ సేవల్లో అంతరాయం ఏర్పడింది. దీని వల్ల వేలాది మంది యూజర్లు ఇబ్బంది పడ్డారు. అమెరికా, భారత్‌లో ప్రభావం ఎక్కువగా ఉన్నట్టు డౌన్‌డిటెక్టర్ ప్లాట్‌ఫామ్ వెల్లడించింది. చాట్‌జీపీటీ సేవల్లో అంతరాయంపై ఒక్క భారత్‌లోనే 800 ఫిర్యాదులు అందాయని ఆ సంస్థ తెలిపింది. తమ సందేహాలకు, ప్రశ్నలకు చాట్‌బాట్ స్పందించ లేదని భారత ఫిర్యాదుదారుల్లో 88 శాతం మంది తెలిపారు.

### నాలుగో క్లాస్‌లో గొడవ.. 50 ఏండ్ల తర్వాత ప్రతీకారం

కన్నూర్, జూన్ 10: ఓ కేరళీయుడు చిన్నప్పుడెప్పుడో నాలుగో క్లాస్‌లో జరిగిన గొడవపై పగ పెంచుకొని 54 ఏండ్ల తర్వాత తన సహధ్యాయిపై దాడి చేశాడు. పోలీసులు అతడితోపాటు మరో నిందితుడిని అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బాలకృష్ణన్, వీజే బాబు నాలుగో తరగతిలో క్లాస్‌మేట్స్. ఆనాడు బాబు తనపై దాడి చేశాడనేది బాలకృష్ణన్ వాదన. ఈ విషయమై కొన్ని రోజుల క్రితం పూర్వ విద్యార్థుల సమావేశంలో ఇద్దరి మధ్య మాటల యుద్ధం జరిగింది. అయితే చివరికి అది పరిష్కారమైనా.. బాలకృష్ణన్, మాథ్యూ మళ్లీ ఈ నెల 2న బాబును కలిసి అప్పట్లో బాలకృష్ణన్‌ను ఎందుకు కొట్టావని మళ్లీ గొడవ పెట్టుకొని బాబుపై దాడి చేశారు. బాధితుడు ప్రస్తుతం కన్నూర్ ప్రభుత్వ వైద్య కళాశాల దవాఖానలో చికిత్స పొందుతున్నాడు.

### అగ్ని ప్రమాదం.. భవనం నుంచి దూకి తండ్రీబిడ్డల మృతి

న్యూఢిల్లీ, జూన్ 10: దేశ రాజధాని న్యూఢిల్లీలో ఒక బహుళ అంతస్తుల భవనంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మరణించారు. ద్వారకా ప్రాంతంలో ఉన్న ఈ భారీ భవనంలోని 8, 9 అంతస్తుల డూప్లెక్స్ ఫ్లాట్‌లో మంగళవారం ఉదయం మంటలు అంటుకున్నాయి. ఎనిమిదో అంతస్తులో ఇంటి లోపల ఉన్న ఆలయం నుంచి మంటలు ప్రారంభమై అది 9వ అంతస్తుకు పాకాయి. దీంతో వాటిలో నివసిస్తున్న యాష్ యాదవ్ (41) అనే వ్యాపారి, అతని కుమార్తె ఆషిమా (12), మేనల్లుడు శివమ్ యాదవ్ (11) మంటల నుంచి తప్పించుకోవడానికి బాల్కనీ నుంచి దూకడంతో మృతి చెందారు.

# భర్త హత్యకు 20 లక్షల సుపారీ

- మేఘాలయ హనీమూన్ మర్డర్ కేసులో వెలుగులోకి వాస్తవాలు
- మృతదేహాన్ని లోయలో పడేసేందుకు నిందితులకు సహకరించిన భార్య సోనమ్



ఇండోర్: మేఘాలయ హనీమూన్ మర్డర్ కేసులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. భర్త రాజా రఘువంశీని చంపించేందుకు భార్య సోనమ్ రూ.20 లక్షల సుపారీ ఇచ్చినట్టు దర్యాప్తులో వెల్లడైంది. తొలుత రూ.4 లక్షలు ఆఫర్ చేయగా, తర్వాత దాన్ని రూ.20 లక్షలకు పెంచినట్టు పోలీసులు తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన రఘువంశీ, సోనమ్ మేఘాలయలో అదృశ్యమైన విషయం తెలిసిందే. రఘువంశీని భార్యనే హత్య చేయించిందని పోలీసులు నిర్ధారించారు.

**హత్యకు ప్లాన్ ఇలా..**

మధ్యప్రదేశ్‌లో ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం చేసే రాజా రఘువంశీని సోనమ్ మే 11న వివాహం చేసుకుంది. అయితే ఆమె ప్రియుడు రాజ్ కుష్వాహ ఆమె తండ్రి వద్ద పనిచేస్తున్న సమయంలో ఇద్దరి మధ్య ప్రేమ ఏర్పడింది. అయితే సోనమ్ కన్నా కుష్వాహ ఐదేండ్లు చిన్నవాడు. దీంతో అతడితో పెండ్లి అంటే తన తండ్రి ఒప్పుకోడని సోనమ్ మాస్టర్ ప్లాన్ వేసింది. ముందుగా రఘువంశీని పెండ్లి చేసుకుని అతడిని చంపేస్తే తాను విధవగా మారుతానని, అప్పుడు కుష్వాహతో వివాహానికి తండ్రి అంగీకరిస్తాడని భావించింది. 'ముందు మనం రాజాను చంపేద్దాం. తర్వాత దానిని దోపిడీగా చిత్రీకరిద్దాం. నేను విధవను అయిన తర్వాత మా నాన్న మన పెండ్లికి తప్పక అంగీకరిస్తాడు' అని ప్రియునికి నచ్చజెప్పింది. ఈ మేరకు భర్తను హనీమూన్‌కు తీసుకుని వెళ్లింది. నలుగురు నిందితులు వీరు బసచేసిన ప్రదేశానికి కిలోమీటర్ దూరంలోని హోటల్‌లో దిగారు. మే 23న భర్తను ఒక కొండ ప్రాంతానికి ఫొటో షూట్ పేరుతో తీసుకుని వెళ్లింది. తాను అలసిపోయినట్టు నటించిన సోనమ్ భర్తతో బాగా వెనుక నడిచి ముగ్గురు నిందితులతో మంతనాలు జరిపింది. చంపండి అని ఆమె అనగానే వారు తమతో తెచ్చుకున్న ఆయుధంతో దాడిచేసి హతమార్చారు. రఘువంశీ మృతదేహాన్ని లోయలోకి తోసేందుకు సోనమ్ నిందితులకు సహకరించింది.

**అంత్యక్రియల్లో నిందితుడు**

రఘువంశీ అంత్యక్రియల్లో నిందితుడు రాజ్ కుష్వాహ పాల్గొన్నాడు. బాధపడవద్దంటూ అతడి తండ్రిని ఓదార్చాడు. ఈ విషయాన్ని రఘువంశీ కుటుంబ సభ్యులు తెలిపారు. రఘువంశీ మృతదేహం ఇండోర్‌కు తీసుకురాగానే సోనమ్ తండ్రి నాలుగు వాహనాల్లో జనంతో వచ్చారని, అందులో కుష్వాహ కూడా ఉన్నాడని చెప్పారు.

**కీలకంగా టీ షర్ట్, మంగళసూత్రం..**

ఘటనా స్థలికి సమీపంలో పోలీసులకు రక్తపు మరకలతో ఉన్న టీ షర్ట్ లభించింది. చిరపుంజికి భర్తతో బయలుదేరినప్పుడు సోనమ్ అదే టీ షర్ట్ ధరించి ఉండటాన్ని సీసీటీవీ ఫుటేజ్‌ల ద్వారా గుర్తించారు. అలాగే షిల్లాంగ్‌లోని హోటల్ లగేజిలో వదిలేసిన మంగళసూత్రాన్ని చూసి వారు అయ్యారు. కొత్తగా పెండ్లయిన మహిళ మంగళసూత్రం లేకుండా ఎలా ఉంటుందని అనుమానించారు. ఇవన్నీ బేరీజు వేసుకుని సోనమ్ బతికే ఉందని నిర్ధారణకు వచ్చారు.

# ఆస్తిపై హక్కుకు రిజిస్ట్రేషన్ ఒక్కటే సరిపోదు!


- అది విధానపరమైన ప్రక్రియ మాత్రమే
- ప్రాపర్టీపై యాజమాన్య నిరూపణకు సమగ్ర డాక్యుమెంటేషన్ అవసరం
- ఇటీవల సుప్రీంకోర్టు కీలక తీర్పు



న్యూఢిల్లీ: ఆస్తి రిజిస్ట్రేషన్ అనేది యాజమాన్య హక్కులు ఇవ్వబోదంటూ ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన కీలక తీర్పు దేశవ్యాప్తంగా విస్తృత చర్చకు దారితీసింది. రిజిస్ట్రేషన్ అనేది ఒక వ్యక్తి హక్కుకు మద్దతు ఇవ్వగలిగినప్పటికీ అది చట్టబద్ధమైన యాజమాన్య హక్కులు, లేదా ఆస్తిపై నియంత్రణను సూచించదని సుప్రీం తీర్పు స్పష్టం చేసింది. యజమానులు, న్యాయవాదులు, రియల్ ఎస్టేట్ డెవలపర్లపై సుప్రీం తీర్పు ప్రభావం చూపే అవకాశం ఉన్నది. అంతే కాదు, కోట్లాది మందికి చిక్కులు తెచ్చిపెట్టే ప్రమాదం కూడా ఉన్నది. ఆస్తి రిజిస్ట్రేషన్, చట్టబద్ధమైన యాజమాన్యాన్ని కలిగి ఉండటం మధ్య స్పష్టమైన వ్యత్యాసాన్ని ఇది చూపిస్తున్నది. రిజిస్ట్రేషన్ అయిందంటే ఇక దానిపై యాజమాన్య హక్కులు వచ్చినట్టేనని గతంలో పరిగణించేవారు. అయితే, రిజిస్ట్రేషన్ అనేది విధానపరమైన ఒక ప్రక్రియ మాత్రమేనని, కానీ యాజమాన్యం అనేది ఆస్తిని ఉపయోగించడానికి, నిర్వహించడానికి, లేదా బదిలీ చేయడానికి చట్టబద్ధమైన హక్కును సూచిస్తుందని సుప్రీం తీర్పు వివరిస్తున్నది.


**డాక్యుమెంటేషన్ అవసరం..**

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం యాజమాన్యాన్ని కచ్చితంగా నిరూపించేందుకు సమగ్రమైన డాక్యుమెంటేషన్ అవసరం. ఆస్తి వివాదాల పరిష్కారానికి న్యాయ పరిష్కారమే కేంద్రంగా ఉండాలి. ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసుకోవడమే కాకుండా అవి చట్టబద్ధమని నిరూపించుకోవాల్సిన ప్రాముఖ్యతను సుప్రీం తీర్పు నొక్కి చెప్తున్నది. ఆస్తి పత్రాలను చట్టపరంగా ధ్రువీకరించుకోవాలని, యాజమాన్యం, రిజిస్ట్రేషన్ సమస్యలపై స్పష్టత కోసం న్యాయనిపుణులను సంప్రదించాల్సిన ఆవశ్యకతను గుర్తుచేస్తున్నది. అలాగే, మారుతున్న ఆస్తి చట్టాలు, కోర్టు తీర్పులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని కూడా స్పష్టం చేస్తున్నది. డెవలపర్లు, కొనుగోలుదారులు, న్యాయవాదులు ఇప్పుడు మరింత స్పష్టమైన చట్టపరమైన వ్యవస్థలో పనిచేయాల్సి ఉంటుంది. ఇది ఆస్తి లావాదేవీలపై నమ్మకాన్ని పెంచే అవకాశం ఉన్నది. యాజమాన్య హక్కుల ప్రాముఖ్యత పెరగడంతో ఆస్తుల విలువపైనా ప్రభావం చూపుతుంది. సుప్రీంకోర్టు తీర్పు దేశంలోని ప్రస్తుత ఆస్తి చట్టాలను సమీక్షించేందుకు దారితీసే అవకాశం ఉన్నది.




## వృద్ధుల బాగోగులకు రోబో

బీజింగ్: జనాభా సంక్షోభంతో సతమతమవుతున్న చైనాలో వృద్ధుల సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతున్నది. ఈ క్రమంలో వారి మంచీచెడ్డా చూసుకునేందుకు అవసరమైన మానవ వనరులు రోజురోజుకు తగ్గిపోతుండటంతో వారి స్థానంలో రోబోలను నియమించే పైలట్ ప్రాజెక్టుకు చైనా శ్రీకారం చుట్టింది. ఈ ప్రాజెక్టులో భాగస్వాములు కావాలంటూ పరిశ్రమ, ఐటీ, పౌర వ్యవహారాల శాఖలు వివిధ సంస్థలను ఆహ్వానిస్తూ సోమవారం ఒక నోటీసు జారీ చేశాయి. వృద్ధుల సంరక్షణలో రోబోటిక్స్ ఏకీకరణను మెరుగుపరచడం ఈ ప్రాజెక్టు లక్ష్యంగా పెట్టుకున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ రోబోలు వృద్ధుల ఆరోగ్యంతో పాటు రోజువారీ కార్యకలాపాలు చూసుకునేలా ఉండేలా ప్రాజెక్టును రూపొందిస్తున్నారు. తద్వారా వారి కుటుంబ సభ్యులపై కూడా భారం తగ్గుతుంది.




## నో ఏసీ.. నో మ్యారేజ్!

ఆగ్రా: తమకు భోజనంలో చికెన్ పెట్టలేదని, మర్యాదలు బాగా చేయలేదని, తమ బంధువులను చిన్నబుచ్చారని ఇలా చిన్న చిన్న కారణాలకే పీటల వరకు వచ్చిన పెండ్లిండ్లు నిలిచిపోవడం చూస్తున్నాం. తాజాగా కల్యాణ మండపంలో తనకు కేటాయించిన గదికి ఏసీ లేదని ఆగ్రహించిన ఒక వధువు ఏకంగా పెండ్లినే రద్దు చేసుకున్న ఘటన ఆగ్రాలో చోటుచేసుకుంది. శంషాబాద్ పట్టణంలో పెండ్లి మండపానికి వచ్చిన వధువు తనకు కేటాయించిన గదికి ఏసీ లేకపోవడాన్ని గమనించింది. వెంటనే ఏసీని ఏర్పాటు చేయాలని కోరింది. వరుడు తరపు వారు నిస్సహాయత వ్యక్తం చేయడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. తన పట్ల కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేని ఇంట్లో తన జీవితం నరకప్రాయం అవుతుందని వధువు కల్యాణ మండపాన్ని విడిచిపెట్టి వెళ్లిపోయింది.




## ఏసీలకు కనిష్ఠ టెంపరేచర్ ఇకపై 20 డిగ్రీలే!

న్యూఢిల్లీ, జూన్ 10: దేశంలో ఏసీల వినియోగానికి సంబంధించి కేంద్రం కొత్త నిబంధనలు తీసుకురాబోతున్నది. విద్యుత్తు వినియోగాన్ని తగ్గించేందుకు ఏసీల కనిష్ఠ టెంపరేచర్‌పై పరిమితులు విధించనున్నది. కనిష్ఠంగా 20 డిగ్రీల సెల్సియస్, గరిష్ఠంగా 28 డిగ్రీల సెల్సియస్‌కు మించకుండా కొత్తగా తయారయ్యే ఏసీలకు ప్రామాణిక నిబంధనలు అమలు చేయనున్నది. కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ మంగళవారం ఈ విషయం వెల్లడించారు. ఈ కొత్త విధానాన్ని త్వరలో అమలు చేస్తామని ఆయన చెప్పారు. ఉష్ణోగ్రతల సెట్టింగ్‌లను ప్రామాణీకరించడానికి దీనిని మొదటిసారిగా ప్రయోగాత్మకంగా చేపడుతున్నామని, దీని ప్రకారం భవిష్యత్తులో ఎయిర్ కండిషనర్లు 20-28 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతల మధ్య మాత్రమే పనిచేస్తాయని తెలిపారు.



## ఆధునిక ప్రేమ సంబంధాలపై ఢిల్లీ వర్సిటీ కోర్సు

న్యూఢిల్లీ, జూన్ 10: డిజిటల్ యుగంలో ఆధునిక ప్రేమ సంబంధాలు, డేటింగ్ యాప్‌లు, సమస్యలు.. సంబంధాల ఒత్తిడిని ఎదుర్కొనటంలో అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు సహాయపడటానికి ఢిల్లీ విశ్వవిద్యాలయం ఒక సరికొత్త కోర్సును ప్రవేశపెట్టింది. ప్రేమ వ్యవహారాలు, డిజిటల్ డేటింగ్, విషపూరితమైన ప్రవర్తనలను అధ్యయనం చేసే విధంగా ఈ విద్యా సంవత్సరం నుంచి 'నెగోషియేటింగ్ ఇంటిమేట్ రిలేషన్‌షిప్స్' అన్న కోర్సును వర్సిటీ సైకాలజీ విభాగం ఆఫర్ చేస్తున్నది. నిజ జీవిత ఉదాహరణలు, గ్రూప్ డిబేట్‌లు, విశ్లేషణలతో ఈ కోర్సు ఉంటుందట. కేవలం ప్రేమ సంబంధాల గురించే కాకుండా, భావోద్వేగ మేధస్సును అభివృద్ధి చేసుకోవటం, లైఫ్ స్కిల్స్‌ను మెరుగుపర్చుకోవటంలో కోర్సు దోహదపడుతుందని వర్సిటీ పేర్కొన్నది.



## బీహార్‌లో నకిలీ పోలీస్ స్టేషన్

పూర్ణియా, జూన్ 10: బీహార్‌లోని ఒక గ్రామంలో ఏకంగా ఒక నకిలీ పోలీస్ స్టేషనే ఏర్పాటు చేసి కొన్ని నెలల పాటు యథేచ్ఛగా నడిచినా పట్టించుకున్న వారే లేకుండా పోయారు. దాని నిర్వాహకుడు ఎడాపెడా ఫైన్‌లు విధించి స్థానికులను దోచుకుని పరారయ్యాడు. బీహార్‌లోని పూర్ణియా జిల్లాలోని మోహనీ గ్రామంలో ఒక పోలీస్ స్టేషన్ ఏర్పాటైంది. రాహుల్ కుమార్ అనే మోసగాడు ఒక స్కూల్‌లో దానిని ఏర్పాటు చేశాడు. గ్రామీణ రక్షక దళం పేరిట నియామకాలు చేపట్టి ఒక్కొక్కరి నుంచి 25 వేల నుంచి 50 వేల రూపాయలు వసూలు చేశాడు. అలా నియమించిన వారికి యూనిఫామ్‌లు, లాఠీలు, ఐడీ కార్డులు వంటివి ఇచ్చి ఊరిపై దాడులకు పంపేవాడు. వారు సారా స్మగ్లర్లు, ఇతర సంఘ విద్రోహులపై దాడులు నిర్వహించి భారీగా జరిమానాలు వసూలు చేసేవారు.